సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 29 । జనవరి । 2023



sunday special

నృత్యం చేస్తున్న కళాకారులు

స్వర నీరాజనం.. నృత్య మనోహరం

- శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో కళాకారుల వైభవం
- కరీం'నగరం'లో నిత్య కీర్తనలు.. సాంస్కృతిక నృత్యాలు
- రాష్ట్ర నలుమూల నుంచి వేలమంది కళాకారుల రాక
- పదిరోజుల పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు
- వేదికపై మూడువేల మందితో నిత్య గీతారాధన

కరీం'నగరం' గోవింద నామస్మరణతో మార్మోగుతోంది. వెంకన్నసేవలో తరిస్తోంది. నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మి– పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 2వ తేదీ గురువారం శోభాయాత్రతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకలు ఓవైపు ఆధ్యాత్మికను పంచుతుండగా.. మరోవైపు వెంకన్నకు స్వరనీరాజనం పలుకుతున్నారు పలువురు కళాకారులు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తూ... సంకీర్తనలు, వివిధ సాంస్కృతిక నృత్యాలతో కళావేదికపై మనోహరాన్ని పంచుతున్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాల్లో కళావైభవం.. పలు కళారంగాలకు చెందిన వారిపై సండే స్పెషల్..

– సాక్షి, కరీంనగర్ డెస్క్



నిత్యం 200 మందితో..



కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు ఆధ్యాత్మికతను పంచే విధంగా కళావేదికపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం 200 వందలమంది కళాకారులతో ఉదయం పదిగంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పారాయణం, కచేరీ, భజనలు, సంకీర్తనలు, జానపద నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం, సంగీత విభావరి,భక్తి నాటకాలు ప్రదర్శిస్తున్నారు. 10 రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కాకుండా తెలంగాణ నలువైపుల నుంచి మూడువేలకు పైగా కళాకారులు తరలివచ్చి స్వామివారికి నీరాజనం పలుకుతున్నారు. శనివారం వరకు సుమారు రెండువేల మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చినట్లు బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి గోగుల ప్రసాద్ వివరించారు.

అనర్గళంగా చాలీసా పారాయణం



కరీంనగర్ పట్టణంలోని పాతబజార్ ప్రాంతానికి చెందిన హనుమాన్ సేవా సమితి సభ్యులు చాలీసా పారాయణంలో ఆకట్టుకుంటున్నారు. ఈ సేవా సమితి ప్రస్తుతం 500కు పైగా సభ్యులతో కొనసాగుతోంది. ప్రతీ కార్యక్రమంలో 50మందితో చాలీసా పారాయణం చేస్తున్నారు. కొండగట్టులో జయంతి ఉత్సవాల సందర్భంగా 2022లో 41 రోజుల చాలీసా పారాయణం చేశారు. 2021లో కొండగట్టులో 18రోజుల పాటు, 2019లో నగునూరు దుర్గాభవాని ఆలయంలో చాలీసా పారాయణం చేశారు. నగరంలోని వెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన చాలీసా పారాయణం ఆకట్టుకుంది. 500మంది సభ్యులతో హనుమాన్ చాలీసా పారాయణం చేసే హనుమాన్ సేవా సమితికి గతంలో వరల్డ్ రికార్డులో సైతం చోటు దక్కింది.

ఆనందంగా ఉంటుంది



మేమంతా కలిసి వివిధ ఆలయాల్లో భజన కార్యక్రమానికి వెళ్తుంటాం.. ప్రతీ ఆలయంలో తక్కువలో తక్కువగా గంటకుపైగానే కార్యక్రమాలు నిర్వహిస్తాం.. మా బృందంలో వృద్ధుల నుంచి యువకుల వరకు ఉన్నారు. దేవుళ్ల పాటలు పాడుతుంటే మనసులో తెలియని ఆనందం ఉంటుంది.

– రాజ్‌కుమార్, శివరామకృష్ణ భజన మండలి, గట్టుదుద్దెనపల్లి

సంకీర్తనల 'రేవతి'



కరీంనగర్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రాంతానికి చెందిన బొజ్జ రేవతి గృహిణి. సంగీతంలో డిప్లొమా చేశారు. 20 సంవత్సరాల నుంచి భక్తి కీర్తనలు పాడుతున్నారు. ధర్మపురి, వేములవాడ, యాదగిరిగుట్ట ఆలయాల్లో రెగ్యులర్‌గా ప్రదర్శనలు ఇస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఐదుసార్లు, ఒకసారి నాదనీరాజనంలో ప్రదర్శన ఇచ్చారు. 2020 జనవరి 2న అమెరికాలోని న్యూ జెర్సీలో సాయిదత్త పీఠంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అప్పుడు మంత్రి పద్మాదేవేందర్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2022 సెప్టెంబర్‌లో కరీంనగర్‌లో తెలంగాణ వజ్రోత్సవాల్లో ఉత్తమ గాయని అవార్డు తీసుకున్నారు. కరీంనగర్‌లోని వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ఐదుసార్లు ప్రదర్శన ఇచ్చారు.

'సురభి' ప్రదర్శనలు



వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర సురభి థియేటర్ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ కృష్ణ లీలలు, పాతాలభైరవి, భక్త ప్రహ్లాద, మాయాబజార్, శ్రీ వేంకటేశ్వర నాటకాలు కలకాలం గుర్తుండిపోతాయి. 138 ఏళ్ల చరిత్ర ఈ కళాకారులకు ఉంది. ప్రస్తుతం ఆరోతరం వారు సైతం ఇదే రంగంలో రాణిస్తున్నట్లు సురభి డైరెక్టర్ జయచంద్ర వర్మ వివరించారు. కరీంనగర్‌లోని వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడేళ్లుగా వీరు నాటక ప్రదర్శన ఇస్తున్నారు. ప్రస్తుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25, 26 రోజున భక్త ప్రహ్లాద, పాతాళభైరవి నాటకాలతో ఆకట్టుకున్నారు. ఈ బృందంలో 60 మంది ఉన్నారు.

నాట్య మయూరాలు.. ఈ తల్లీకూతుళ్లు



సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన అనూషా యశస్విని ప్రభుత్వ టీచర్. ప్రస్తుతం ముస్తాబాద్ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. యశస్వినికి చిన్నతనం నుంచి నృత్యం అంటే ఇష్టం. సిరిసిల్లలోని శ్రీబాలా త్రిపుర సుందరి కూచిపూడి నాట్యాలయంలో గురువు భోగ ధర్మరాజు నేతృత్వంలో యశస్విని కూతురు శ్రీమేధతో కలిసి నృత్యంతో సాధన చేస్తున్నారు. శ్రీమేధ ప్రస్తుతం ఆరోతరగతి చదువుతోంది. వేములవాడలో మహాశివరాత్రికి, కొండగట్టులో హనుమాన్ జయంతి సందర్భంగా, ఇటీవల కరీంనగర్‌లో వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మొత్తంగా ఇప్పటి వరకు 30కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. అనూషా యశస్విని చెల్లెలి కూతురు హన్సిణి సైతం కూచిపూడిలో రాణిస్తోంది. హన్సిణి తల్లిదండ్రులు నరేశ్– నిరోషా చిన్నారి ప్రతిభను గుర్తించి కరీంనగర్‌లోని సంస్కృతి టెంపుల్ ఆఫ్ డ్యాన్స్‌లో గురువు సురేంద్రచారి వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న హన్సిణి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన ఇచ్చి టౌన్, ట్రాఫిక్ ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, విజయ్‌కుమార్‌ల నుంచి ప్రశంసలు పొందింది.

ఏళ్ల తరబడి..



కరీంనగర్‌లో ఏళ్ల తరబడి చాలీసా పారాయణం చేస్తున్నాం. పాతబజారులో వేలాది మంది సభ్యులతో నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పదిమందితో ప్రారంభమై.. ఇప్పుడు ఐదువందలకు పైగా సభ్యులతో కొనసాగుతున్నాం. చాలీసా పారాయణంతో మనసు భక్తిపారవశ్యంతో ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో అవకాశం పూర్వజన్మ సుకృతం.

– బోగ శ్రీనివాస్, హనుమాన్ సేవా సమితి, పాత బజార్, కరీంనగర్

భక్తి భజనలో గట్టుదుద్దెనపల్లి వాసులు



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుంటున్నారు. ఈ భజన మండలి 40ఏళ్లుగా 19మంది సభ్యులతో కొనసాగుతోంది. ప్రముఖ గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ శంకలింగం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరు ఇప్పటి వరకు వేములవాడ, యాదాద్రి, కొండగట్టు, భద్రాచలంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి బృందంలో 60 ఏళ్ల వయసు ఉన్న పెద్దల నుంచి 22 ఏళ్ల యువకుల వరకు స్వామివార్ల ఆరాధన చేతున్నారు. కరీంనగర్ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఈనెల 27న వీరు ప్రదర్శన ఇచ్చారు. ఆంజనేయస్వామి గీతాలు, అయ్యప్ప కీర్తనలు, వెంకన్న పాటలతో ఆకట్టుకుంటున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆర్గనైజ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.. మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మినీ తిరుమలను తలపిస్తోంది. కళావేదికపై వేలాదిమంది కళాకారులు తమ ప్రతిభను చాటుతుండగా.. మేము వారిని సత్కారాలతో అభినందిస్తున్నాం. శోభాయాత్రలో మూడువేల మంది కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

– గోగుల ప్రసాద్, బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి

న్యూస్‌రీల్

సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని మధ్యాహ్నభోజన వర్కర్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు శనివారం వినతిపత్రం అందించారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు పెంచిన వేతనాలు ఇచ్చేలా చూడాలని వర్కర్ల సంఘం నాయకుడు పూసాల రమేశ్ తదితరులు కోరారు.

బాధ్యతలు స్వీకరించిన డీసీపీ



డీసీపీని అభినందిస్తున్న పోలీస్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి డీసీపీగా వైభవ్ గైక్వాడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, సతీష్, వేణుగోపాల్, చంద్రశేఖర్, రమేశ్‌బాబు, పలువురు ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు, శాంతిభద్రతలు కాపాడేందుకు నిరంతర సేవలందిస్తామని డీసీపీ పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈవో

ధర్మారం: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని డీఈవో మాధవి సూచించారు. ధర్మారం మండలం నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వేల్పుల శ్రీలత (నిజమైన స్నేహితులు), నాగుల శ్రీనిత్య (మణిపూసల కవితలు), బుర్ర వైష్ణవి (ఆడపిల్ల మణిపూసల శతకం) రచించిన పుస్తకాలను శనివారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడుతూ పుస్తకాలను బాగా రాశారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. జిల్లా గర్ల్స్ చైల్డ్ అధికారి అనురాధ, సెక్టోరియల్ అధికారి పీఎం షేక్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సర్పంచు ఆడువాల అరుణజ్యోతి, ఎంపీటీసీ దాడి సదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్న కేంద్రం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని: లాభాల్లో కొనసాగుతున్న సింగరేణిని ప్రైవేటీకరించే క్రమంలో సంస్థ భవిష్యత్‌ను కేంద్రం ప్రశ్నార్థకంగా మారుస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. శనివారం వకీల్‌పల్లిగనిలో ఏర్పాటు చేసిన బాయిబాటలో మాట్లాడారు. సింగరేణి సంస్థ ఈప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక జీవనాడి అని, తక్కువ కాలంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు మోదీ సర్కార్ కుట్ర చేస్తోందన్నారు. అందరి ఆశీర్వాదంతో గెలిచిన తాను ప్రజలు, సింగరేణి కార్మికుల రుణం తీర్చుకునేలా సమస్యల పరిష్కారంలో కృషి చేస్తానన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, కెంగర్ల మల్లయ్య, బలి శ్రీనివాస్, జాహిద్‌పాషా, దశరథం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భద్రతలో భళా.. బడిలో డీలా!

- సామాజిక భద్రతలో పాత జిల్లా మెరుగు
- బడిలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా
- తలసరి ఆదాయం, విద్యుత్తు కనెక్షన్లలో ముందంజ
- నాలుగు జిల్లాల్లో మెరుగుపడాల్సిన రహదారులు
- రాష్ట్ర గణాంక నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సామాజిక భద్రత విషయంలో ఉమ్మడి జిల్లా భళా అనిపించుకుంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన తలసరి ఆదాయం, విద్యుత్ కనెక్షన్లు, రహదారులు తదితరాల విషయంలోనూ రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోల్చినప్పుడు ముందంజలోనే ఉంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ఏర్పాటు విషయంలో మాత్రం చాలా వెనుకబడి ఉంది. వివిధ విభాగాల్లో 33 జిల్లాలు సాధించిన పురోగతిని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర గణాంకాల నివేదికలో పొందుపరిచింది.

విద్యుత్తు కనెక్షన్లలో కరీంనగర్ టాప్..!

రాష్ట్రంలో విద్యుత్తు కనెక్షన్ల విషయంలో ఉమ్మడి జిల్లా ముందంజలో ఉంది. జిల్లాల విద్యుత్తు వ్యవసాయ, గృహ, పారిశ్రామిక కనెక్షన్లను గమనిస్తే.. హైదరాబాద్ తొలిస్థానంలో ఉండగా.. కరీంనగర్ 10వ స్థానంలో నిలిచింది. పెద్దపల్లి (13వ స్థానం), జగిత్యాల (17వస్థానం)

ర్యాంకు	జిల్లా	మొత్తం కనెక్షన్లు
10	కరీంనగర్	5,39,036
13	పెద్దపల్లి	5,05,611
17	జగిత్యాల	3,53,141

తరువాత స్థానంలో నిలిచా యి. రాష్ట్రవ్యాప్తంగా తలసరి విద్యుత్తు వినియోగం 2020–21లో 2012 కిలోవాట్లుగా ఉండగా.. 2021–22లో 2126 కిలోవాట్లకు చేరడం గమనార్హం.

దారిన పడని రహదారులు..!

ర్యాంకు	జిల్లా	మొత్తం రోడ్లు (కి.మీ)
15	జగిత్యాల	2,967
21	కరీంనగర్	2,570
25	పెద్దపల్లి	2,275
28	రాజన్న సిరిసిల్ల	2,082

మౌలిక సదుపాయాల్లో కీలకమైన రహదారుల విషయంలో ఉమ్మడి జిల్లా వెనకబడిందనే గణాంకాలు చెబుతున్నాయి. 33 జిల్లాల్లో ఉన్న జాతీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారుల వివరాలను పరిశీలించినప్పుడు ఇదే విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల రోడ్లను పరిశీలిస్తే.. జగిత్యాల 15వ స్థానంలో మెరుగైన ర్యాంకుతో ఉంది. తరువాత స్థానంలో కరీంనగర్ (21వస్థానం), పెద్దపల్లి (25వస్థానం), రాజన్నసిరిసిల్ల (28వస్థానం)లో నిలిచాయి.

తలసరి ఆదాయం సూపర్

ర్యాంకు	జిల్లా	తలసరి ఆదాయం
12	కరీంనగర్	రూ.1,10,568
13	పెద్దపల్లి	రూ.1,06,184
24	రాజన్నసిరిసిల్ల	రూ.88,932
27	జగిత్యాల	రూ.84,742

రాష్ట్రవ్యాప్తంగా పౌరుల తలసరి ఆదాయం గణాంకాల్లో ఉమ్మడి జిల్లా మంచి ర్యాంకును నమోదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పౌరుల సరాసరి సగటు తలసరి ఆదాయం రూ.1,43,023గా ఉంది. జిల్లాల విషయానికి వస్తే.. రంగారెడ్డి రూ.4,18,964తో టాప్‌లో నిలిచింది. కరీంనగర్ జిల్లా 12వ ర్యాంకుతో ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానం దక్కించుకుంది. అదే సమయంలో పెద్దపల్లి (13వస్థానం)తో రెండోస్థానంలో నిలవగా.. రాజన్నసిరిసిల్ల (24), జగిత్యాల (27)తో కాస్త వెనకబడ్డాయి.

పాఠశాలల్లో దయనీయం..

ర్యాంకు	జిల్లా	మొత్తంస్కూళ్లు	విద్యార్థులు
05	రాజన్నసిరిసిల్ల	655	78,195
08	పెద్దపల్లి	769	98,425
11	కరీంనగర్	1,014	1,46,920
17	జగిత్యాల	1,122	1,46,632

పాఠశాలల విషయంలో ఉమ్మడి జిల్లా చాలా వెనకబడి ఉంది. పాఠశాలల సంఖ్యను విద్యార్థుల సంఖ్యతో సగటు లెక్కించినప్పుడు ఈ విషయం స్పష్టమవుతోంది. తక్కువ స్కూళ్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రాష్ట్రంలో రాజన్నసిరిసిల్ల జిల్లా 5వ స్థానంలో నిలిచింది. అదే సమయంలో పెద్దపల్లి (8వ స్థానం), కరీంనగర్ (11వ స్థానం), జగిత్యాల (17వ స్థానం)లో నిలిచాయి.

సామాజిక భద్రతలో భేష్

నిరుపేదలు, సమాజంలో పలు కారణాల వల్ల వెనకబడిన పలువురికి ప్రభుత్వం సామాజిక భద్రత కింద బియ్యం, పింఛన్లు అందజేస్తోంది. ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలో మెజారిటీ పేదలకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తోంది. రేషన్‌కార్డుల విషయంలో జగిత్యాల రాష్ట్రంలో 9వ స్థానంలో ఉమ్మడి జిల్లాలో తొలిస్థానంలో నిలిచింది. కరీంనగర్ (12వ స్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వ స్థానం) తరువాత స్థానాల్లో నిలిచాయి. అదే వృద్ధాప్యం, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ రోగులకు ప్రభుత్వపరంగా అందజేసే పింఛన్ల విషయంలోనూ జగిత్యాల రాష్ట్రంలో 3వ స్థానం, ఉమ్మడి జిల్లాలో తొలిస్థానం దక్కించుకుంది. కరీంనగర్ (12వస్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వస్థానం) తరువాత స్థానాలు దక్కించుకున్నాయి.

ర్యాంకు	జిల్లా	షాపులసంఖ్య	ఎఫ్ఎస్‌సీకార్డు
09	జగిత్యాల	593	2,95,915
12	కరీంనగర్	487	2,64,490
20	పెద్దపల్లి	413	2,09,954
26	సిరిసిల్ల	344	1,61,524

ఆసరా పింఛన్లు ఇలా..

ర్యాంకు	జిల్లా	మొత్తం పింఛన్లు
03	జగిత్యాల	2,29,459
13	కరీంనగర్	1,41,923
16	సిరిసిల్ల	1,21,295
25	పెద్దపల్లి	98,009

క్లుప్తంగా

నేత్రదానం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇరుగురాల రాజమల్లు అనారోగ్యంతో చనిపోగా.. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు ముడారపు రవీందర్, టెక్నీషియన్ ఎస్‌కే.ఆరిఫ్ నేత్రాలు సేకరించారు.

రాజస్తాన్ దర్గాకు చాదర్...



దర్గాలో సమర్పించేందుకు చాదర్ పంపుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని ముస్లిం నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజస్తాన్‌లోని ఖాజాగరీబ్ నవాజ్ దర్గా 811 ఉర్సు సందర్భంగా చాదర్‌ను సమర్పించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అందించారు. నాయకులు అబ్దుల్ మన్నన్, కలీం, అష్ఫక్, షాహిద్, నాజీం, షఫీక్‌అహమద్, ముజాహిద్ తదితరలున్నారు.

నిందితుడి అరెస్టు



డిప్యూటీ తహసీల్దార్ ఎదుట రిమాండ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ధర్మారం: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన మండలంలోని ఖిలావనపర్తికి చెందిన గుజ్జుల మల్లేశంను శనివారం రిమాండుకు పంపించినట్లు ఎక్సైజ్ ఎస్సై మనీషా రాథోడ్ తెలిపారు. గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న మల్లేశంను గత ఏప్రిల్ 28న తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు షరతు విధించారు. మల్లేశం తిరిగి గుడుంబా అమ్ముతుండడంతో ఎక్సైజ్ అధికారులు రెండుసార్లు నోటీసులు పంపించారు. అయినా పట్టించుకోకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ మల్లారెడ్డి ఎదుట హాజరుపర్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌చార్జి ఎస్సై శ్రీనాథ్, ఆర్‌ఐ వినోద్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడికి గాయాలు



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ ఊదరి శ్రీనివాస్ గాయపడ్డాడు. ప్రాజెక్టులోని బ్రహ్మపుత్ర షావల్‌వద్ద లిఫ్టబకెట్ నుంచి పైకి వెళ్లి షావల్‌కు మరమ్మతు నిర్వహిస్తున్న క్రమంలో బకెట్ లింక్ ఊడిపోయి కింద పడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన అతడిని వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదం తీరుపై అధికారులు విచారణ చేపట్టారు.

జీజీహెచ్‌లో ‘లక్ష్య’ బృందం తనిఖీ

- రెండు విభాగాల్లో 148 అంశాలపై పరిశీలన
- 75 శాతానికి పైగా మార్కులొస్తేనే ఎంపిక



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జాతీయ లక్ష్య ప్రోగ్రాం బృందం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి (జీజీహెచ్)ని జాతీయ లక్ష్య కార్యక్రమం బృందం శనివారం పరిశీలించింది. ఆస్పత్రిలో ప్రసూతి సేవలను మెరుగుపర్చడంతోపాటు లేబర్ రూం, మెటర్నటీ ఓటీ వినియోగం తీరుపై బృందం రెండు రోజులుగా చేపట్టిన అసెస్‌మెంట్ శనివారంతో ముగిసింది. బృందంలో పుదుచ్చేరికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ఇమ్యూనైజేషన్ అధికారి రాజందాల్, కేరళలోని కాలికట్‌కు చెందిన డాక్టర్ బిందు ఉన్నారు.

మాతా, శిశుమరణాల తగ్గింపే లక్ష్యం

మాతా, శిశుమరణాల రేటును తగ్గించడానికి సుఖ ప్రసవం జరిగేలా ఏటా కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రీసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) ద్వారా ‘లక్ష్య’ ప్రోగ్రాం పేరుతో ప్రభుత్వ ఆస్పత్రులకు పోటీలు నిర్వహిస్తోంది. 2019లో కూడా లక్ష్య బృందం ఈ ఆస్పత్రిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఆ సమయంలో రూ.4లక్షలు మంజూరయ్యాయి. మూడేళ్ల తర్వాత ఇదే ఆసుపత్రిని మరోసారి తనిఖీ చేసింది.

చెక్‌లిస్టు ఆధారంగా వివరాల సేకరణ

లక్ష్య చెక్‌లిస్టు ప్రకారం ప్రసూతికి వస్తున్న వారి వివరాల రికార్డులను బృందం ప్రతినిధులు పరిశీలించారు. లేబర్ రూం, మెటర్నటీ ఓటీలో మార్గదర్శకాల ప్రకారం చేపడుతున్న సేవలు రికార్డులు తనిఖీ చేశారు. ఎస్ఎన్‌సీయూతో కలిపి రెండు విభాగాల్లో మొత్తం 148 అంశాలను పరిశీలించారు. ఆస్పత్రి వైద్యాధికారులతో సమీక్షించారు.

75 శాతంకుపైగా మార్కులు వస్తేనే పోటీలో ఎంపిక

లక్ష్య పోటీలో లేబర్ రూమ్‌కు 100 మార్కులు, మెటర్నటీ ఓటీకి 100 మార్కులు చొప్పున కేటాయించారు. ఒక్కో విభాగంలో 75 శాతానికి పైగా మార్కులు పొందితేనే గెలుపొందే అవకాశం ఉంది. 2019లో ఏరియా ఆస్పత్రిగా ఉన్న జీజీహెచ్ ‘లక్ష్య’ గుర్తింపు పొందింది. దీంతో లేబర్ రూమ్‌కు రూ.2లక్షలు, మెటర్నటీ ఓటీకి రూ.2లక్షలు చొప్పున మంజూరయ్యాయి. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, గైనకాలజీ విభాగం హెచ్ఓడీలు అరుణ, భాను, జిల్లా క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ అనిల్, నర్సింగ్ సూపరింటెండెంట్ జమున, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

మూడేళ్లలో గణనీయమైన అభివృద్ధి

- నగర మేయర్ బంగి అనిల్‌కుమార్
- అరగంటలో ముగిసిన బల్దియా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అనిల్ కుమార్, పాల్గొన్న కార్పొరేటర్లు

కోల్‌సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో బల్దియా ఏడో జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మూడేళ్లగా రామగుండం గణనీయమైన అభివృద్ధి చెందిందని, నగరంలో పనులు చురుకుగా కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మొత్తం నాలుగు అంశాలు ప్రవేశపెట్టారు. మూడు అంశాలను సభ్యులు ఆమోదించారు. కంటి వెలుగు ఏర్పాట్లలో భాగంగా శిబిరాలలో టెంట్లు, కుర్చీలు, టేబుళ్లు, ఎలక్ట్రికల్ మెటీరియల్ కొనుగోలు, హోర్డింగ్స్, ఫ్లెక్సీల ఏర్పాటు తదితర వాటికి రూ.13.45 లక్షలు చెల్లించే అంశానికి ఆమోదం తెలిపారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయలను డిమాండ్‌లో నిలిపివేయుటకు ప్రతిపాదనలను సీడీఎంఏ కార్యాలయానికి సమర్పించడానికి ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేటాయించిన రూ.1,150.37 లక్షల్లో 50 శాతం రూ.575.18 లక్షలు తాగునీటి సరఫరా పనులకు వినియోగించుకోవడానికి.. రూ.421.64 లక్షలతో 11 పనులు చేపట్టే అంశానికి ఆమోదం తెలిపారు. కూలిపోయిన 592 నంబర్ ఇంటి అస్సెస్మెంట్ల ఆస్తి పన్ను డిమాండ్, ఇంటి నంబర్లు తొలగించే అంశాలను వాయిదా వేశారు. అయితే సమావేశాన్ని కేవలం అరగంటలోనే ముగించి మమ అనిపించడంపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమైంది. ముందుగా ఇటీవల మరణించిన గడ్డి కనకయ్య అనే సీనియర్ సివిల్ కాంట్రాక్టర్‌కు సభలో మౌనం పాటించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు ఎప్పుడిస్తారు సారూ..!

- రెండోవిడత జాప్యంపై యాదవ సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న యాదవులు

కాల్వశ్రీరాంపూర్: రెండోవిడత గొర్రెల పంపిణీ ఎప్పుడు చేస్తారంటూ.. కాల్వశ్రీరాంపూర్‌లో యాదవ సంఘం నాయకులు స్థానిక ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. భార్యమీది పుస్తెలు అమ్మి డీడీలు చెల్లించామని, ఏళ్లు గడుస్తున్నా గొర్రెలు పంపిణీ చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కావస్తున్నా సర్కార్ ఊసెత్తడం లేదని యాదవ సంఘం నాయకులు గాజనవేన సదయ్య, అల్లం కొమురయ్య అన్నారు. మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెన్నంపల్లి, తారుపలి మడిపెల్లి, మొట్లపల్లి, కూనారం, కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి, మంగపేట గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు చీర ఓదెలు, అజయ్, మహేశ్, గోవర్దన్, కుమార్, మల్లేశ్, సారయ్య, రామచంద్రం, రవి ఆయా గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..



ప్రదర్శనగా వస్తున్న వివేక్, సురేశ్‌రెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన పలువురు వునుకొండ శ్రీధర్‌పటేల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, స్థానిక నాయకుడు గొట్టిముక్కుల సురేశ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేక్ మాట్లాడుతూ.. మోదీ పాలననే ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలకుల అవినీతి, అక్రమాలకు అంతులేకుండాపోయిందన్నారు. అంతకు ముందు ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వునుకొండ తిరుపతి, ప్రశాంత్, తూముల రవితేజ, వేణుగోపాల్, భానుతేజ, మహేశ్, వంశీ, ప్రఫుల్ల, హర్షదీప్, సాయిగణేశ్, సిద్దు, శివారెడ్డి, సతీష్, అభి, ఉప్పు కిరణ్, సజ్జద్, సుధాకర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, సోడాబాబు, ఫయాజ్, శ్రీనివాస్, సతీష్, భూమయ్య తదితరులున్నారు.

మల్లన్న సన్నిధిలో శివరాత్రి వేడుకలు

- మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి ఈశ్వర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ఓదెల: ఓదెల మల్లన్న ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మహా శివరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చేనెల 18, 19 తేదీల్లో జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ మేకల మల్లేశంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మంత్రికి మల్లికార్జునస్వామి మెమొంటో బహూకరించారు. ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు

- ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగయ్య



మొక్కలు పరిశీలిస్తున్న నాగయ్య

పాలకుర్తి: అటవీశాఖ ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి సీహెచ్.నాగయ్య సిబ్బందికి సూచించారు. శనివారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం డెయిరీ ఫాం ఆవరణలో అటవీశాఖ ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా అటవీశాఖ ఆరు నర్సరీలు నిర్వహిస్తోందని, దాదాపు 3లక్షల వరకు మర్రి, రావి, వేప, వెదురు, అల్లనేరడి వంటి 20 రకాల మొక్కలు పెంచుతున్నామని తెలిపారు. వీటితో పాటు మున్సిపాలిటీలకు అందించేందుకు ప్రత్యేకంగా దాదాపు 55వేల మొక్కలు పెంచుతున్నట్లు వివరించారు. నర్సరీలల్లో కలుపులేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటి రేంజ్ ఆఫీసర్ దేవదాస్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే మైనార్టీలకు మేలు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీలకు మేలు జరిగిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీ 13, 14 వార్డుల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మైనార్టీలకు యూనిట్లు మంజూరు చేస్తున్నామని చెబితే వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాకు 50 యూనిట్లు కూడా దాటడం లేదని విమర్శించారు. గ్యాస్, ఆర్టీసీ బస్సుచార్జీల ధరలు అడ్డగోలుగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, కౌన్సిలర్లు మల్లయ్య, సంపత్, నాయకులు బి.సురేశ్‌గౌడ్, రఫియుల్లాఖాన్, తిరుమల రావు, నెత్తెట్ల కుమార్, సుధాకర్‌రెడ్డి, శ్రీమాన్, శ్రీనివాస్, జగదీశ్, నర్సయ్య, రవి, మసూద్, మహేశ్, రంగు శ్రీను, రాజు, శ్రీకాంత్, నదీం, మెహరాజ్, హకీం, అబ్బు తదితరులున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం



ఎండీ.హసీబ్ (ఫైల్)

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండీ.హసీబ్ (19) మృతి చెందాడు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఖలిక్ కుమారుడు హసీబ్ తన స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఆటోనగర్‌లోని సర్వీస్ రోడ్డుపైకి చేరగానే ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే హసిబ్ మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతి పరారీలో ఉన్నాడని, ఖలీక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎలిగేడు సింగిల్‌విండో వైస్ చైర్మన్ మృతి

ఎలిగేడు: ఎలిగేడు సింగిల్‌విండో వైస్ చైర్మన్ చింతిరెడ్డి గణపతిరెడ్డి (50) అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు సంతాపం వ్యక్తం చేశారు. ఈయనకు కుమారుడు, కూతురు సంతానం.

ఆర్జీ-1 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్



క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధిలోని కార్మికులకు శనివారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులకు స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 107 క్వార్టర్స్‌కు 195 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత, కేటగిరీ, పదవిని బట్టి క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ సలీం, సీనియర్ పర్సనల్ అధికారి నరేశ్‌చక్రవర్తి, సంక్షేమాధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు చెల్లించాలి



కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న డ్రైవర్లు

రామగిరి: పెరిగిన వేతనాలు, బోనస్, ఏరియర్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ.. సింగరేణి కన్వెంట్ డ్రైవర్లు శనివారం సమ్మెబాట పట్టారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ఎస్‌వోటూ జీఎం రఘుపతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు బుర్ర తిరుపతి, ఆకుల వెంకన్న మాట్లాడుతూ పెరిగిన వేతనాలు చెల్లించి డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. బీజేపీ నాయకులు ముల్యారి శ్రీనివాస్, ఐలయ్య, తిరుపతి, రాజు, మహేందర్‌రెడ్డి, సాంబయ్య, రాజు, నాయక్, శంకర్, శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై భవిష్యత్ కార్యాచరణ

- నేడు సుల్తానాబాద్‌లో విస్తృత సమావేశం
- మానేరు పరిరక్షణ సమితి వెల్లడి

సుల్తానాబాద్: జిల్లాలోని మానేరు వాగులో ఇసుక తవ్వకాలపై భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మానేరు పరిరక్షణ సమితి చైర్మన్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు మండలకేంద్రంలోని వైశ్య భవనంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా.. జన జీవితానికి వాటిల్లుతున్న కష్టనష్టాలపై చర్చిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతి లేకుండా మానేరులో ఇసుక క్వారీలకు అనుమతివ్వొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ.. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ యథేచ్ఛగా మానేరులో ఇసుక తరలిస్తోందని విమర్శించారు. సుల్తానాబాద్ నుంచి మంథని వరకు గల మానేరు తీర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక రీచ్‌ల నుంచి తవ్వకాల నిలిపివేత

ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఆదేశం మేరకు ఇసుక రీచ్‌లలో డిసిల్టేషన్ (తవ్వకాలు) నిలిపివేశామని మానేరు ఇసుక క్వారీల యజమానులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వారీల్లో నిల్వ ఇసుకను మాత్రమే తరలిస్తున్నామని, ప్రభుత్వ అవసరాల మేరకు రీచ్‌ల నుంచి డిసిల్టేషన్ చేయబడుతుందని, అది కూడా ఎన్జీటీ ఆదేశం ప్రకారమేనని వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలు తీర్చండి

- సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అంగన్‌వాడీటీచర్లు, ఆయాలతో కలిసి శనివారం వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యుటీ వర్తింపజేయాలని, వేతనంలో సగం పింఛన్‌గా ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజనర్సమ్మ, ఉమారాణి, హేమలత, కళావతి, రేణుక, జమున, అరుణ, వసంత తదితరులున్నారు.

పోస్టాఫీస్‌లు నేడు పనిచేస్తాయ్..

- ఖాతాలు ఇచ్చేందుకు తెరిచి ఉంచుతాం
- పోస్టల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

పెద్దపల్లిరూరల్: పోస్టాఫీసులు ఆదివారం కూడా తెరిచే ఉంచుతున్నామని, ప్రజలకు కొత్త ఖాతాలు అందించాలనే ఆలోచనతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని పోస్టల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. పోస్టాఫీసుల్లో పొదుపు, డిపాజిట్లు చేసుకునే వారికి కొత్త వడ్డీ రేట్లు వర్తింపజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

ఆలోచింపజేసిన మానేరు వెలస్కో 23 ప్రదర్శనలు

- ప్రారంభించిన ఐఎంఐ అధ్యక్షుడు రామ్‌కిరణ్



మానేరు పాఠశాలలో కరోనా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో శనివారం మానేరు వెలస్కో–23 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తమ మేథస్సుకు పదనుపెట్టి చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మానేర్ వెలస్కో–23 కార్యక్రమాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులుపి.రాంకిరణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. మానేరు విద్యార్థులు తమ మేథస్సుకు పదనుపెట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా వినూత్న తరహాలో ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం క్లాస్‌రూంకే పరిమితం కాకుండా తమలోదాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అతిథులు విద్యార్థుల ప్రదర్శనల స్టాళ్లను తిలకించారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రముఖ వైద్యులు సీహెచ్.రమణాచారి, ఎల్.అమృత్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు సునీతారెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి



పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ధర్మారం: వరిని ఆశిస్తున్న చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఏవో ఆదిరెడ్డి సూచించారు. మండలంలోని దొంగతుర్తిలో పొలాన, కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ అధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాండం తొలుచు పురుగు ఉనికి, అగ్గితెగులు నివారణ చర్యలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. మొగిపురుగు నివారణకు పిప్రోనిల్ గుళికలను ఎకరాకు 4కిలోలు వేయాలని, 15 రోజుల సమయంలో ఎకరాకు కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్‌సిద్ధి, బలరాం, ఓంప్రకాష్, రజినీకాంత్, మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, ఏఈవో ప్రశాంత్, ఇన్‌చార్జి సర్పంచు ముత్యాల చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఎంపీటీసీ దాడి సదయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నైపుణ్యం పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశమందిరంలో టైపిస్టు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ స్థాయి అధికారులకు రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, ఆన్‌లైన్‌లో వచ్చే మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు అప్‌డేట్ కావాలని సూచించారు. ట్రైనింగ్ సెంటర్ హెడ్ శ్రీనివాసరాజు, ట్రైనర్ మోహన్‌కృష్ణ తదితరులున్నారు.